మోటకొండూరు పీహెచ్‌సీలో నిర్వహించిన ఆశా డే కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ పరిపూర్ణాచారి

సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలి

● డీఎంహెచ్‌ఓ పరిపూర్ణాచారి

మోటకొండూర్, జనవరి 9 : ఆశ కార్యకర్తలు మాతా శిశు సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పరిపూర్ణాచారి ఆశ కార్యకర్తలకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించి.. ఆశ డే కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి మధుసూదన్‌రెడ్డి, మండల వైద్యాధికారి విజయ్, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అనాజిపురంలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న జడ్పీటీసీ శారదాసంతోష్‌రెడ్డి

క్రీడలతో స్నేహభావం పెంపు

● జడ్పీటీసీ శారదాసంతోష్‌రెడ్డి

మోత్కూరు, జనవరి 9 : క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని మోత్కూరు జడ్పీటీసీ గోరుపల్లి శారదాసంతోష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అనాజిపురంలో సుభాశ్ చంద్రబోస్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. సర్పంచ్ ఉప్పల లక్ష్మమ్మ, మాజీ ఎంపీపీ వంగాల సత్యనారాయణ, పేలపుడి సత్యనారాయణ చౌదరి, పంజాల రామకృష్ణ, దీటి సందీప్, బండ అరవింద్‌రెడ్డి, గోరుపల్లి శ్రీనివాస్‌రెడ్డి, దేవర శ్రీశైలం, టోర్నమెంట్ నిర్వాహకులు బీసు శ్రవణ్, మలిపెద్ది మహిపాల్‌రెడ్డి, గోరుపల్లి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

రామన్నపేటలో అక్షింతలు పంపిణీ చేస్తున్న వెంకటేశ్వరాచారి

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ

రామన్నపేట, జనవరి 9 : అయోధ్య రాముడి అక్షింతలను ప్రతి ఇంటికీ పంపిణీ చేస్తున్నట్లు మాజీ ఎంపీటీసీ, సింగిల్ విండో డైరెక్టర్ కన్నెకంటి వెంకటేశ్వరాచారి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయంలో అక్షింతలకు ప్రత్యేక పూజలు చేసి ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవ్యరామ మందిర నిర్మాణం ప్రతి ఒక్క హిందువు కల అని, జనవరి 22న అయోధ్యలో రాములోరి ప్రాణప్రతిష్ట రోజు తమ ఇంటి ముందు దీపాలు వెలిగించి దీపావళి జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాపోలు రమేశ్, సింధం లింగయ్య, చంద్రగిరి వెంకటేశ్, రాపోలు రాజశేఖర్, చెరుకు ఉపేందర్, చిన్నపాక స్వామి, అమర్, నితిన్, యశ్వంత్, సిద్ధూ, నిఖిల్, వేణుమాధవ్ పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని సాయి నగర్‌లో అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాముడి నామస్మరణ మారుమోగింది. కార్యక్రమంలో సర్పంచ్ గౌని శోభాదాసుగౌడ్, భక్తులు పాల్గొన్నారు.

మఠంపల్లిలో గంగిరెద్దుల విన్యాసాలు

గ్రామాల్లో బసవన్నల సందడి

మఠంపల్లి, జనవరి 9 : సంక్రాంతి పండుగ సమీపిస్తుండడంతో పల్లెల్లో సందడి మొదలైంది. మహిళలు తమ ఇళ్ల ముంగిట రంగు రంగుల ముగ్గులు వేస్తూ ఆహ్లాదాన్ని పంచుతుండగా.. గంగిరెద్దుల వారి విన్యాసాలు ఆకట్టుకుంటున్నాయి. మంగళవారం మఠంపల్లి మండల కేంద్రంలో గంగిరెద్దుల విన్యాసాలతో సంక్రాంతి సందడి కనిపించింది. గంగిరెద్దుల వారు ప్రతి ఇంటికి వెళ్లి విన్యాసాలు ప్రదర్శిస్తూ, ఇంటి వారిని పొగుడ్తూ కానుకలు పొందారు. గ్రామస్తులు గంగిరెద్దుల వారి విన్యాసాలను ఆసక్తిగా తిలకించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

FLAT FOR SALE
★HAYATHNAGAR: Walkable Distance, Vijayawada Highway, Beside Bus Stop, Sup. Luxurious 3 BHK Flats, Ready to move, 2 side 30' Rd. Ph: 9247326642 / 9849801477.
NT-314488

WANTED
★ప్రముఖ సంస్థ హాలియా నందు పని చేయుటకు పారిశుద్ధ్య కార్మికులు మరియు హెల్పర్స్ వెంటనే కావలెను. హాలియా ప్రాంతం వారికి అధిక ప్రాధాన్యత ఇవ్వబడును. Ph: 7675910480.
NT-319652

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/- ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available Minimum 4 Lines, Extra Line - Extra Amount
5% GST Extra
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రామ పంచాయతీ, మండల సర్వేగూడెం.
సల్లగొండ : 9182777626 | సల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | ఉమ్మడి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777100 | కోదాడ : 9182777638

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తాం

● ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ఆత్మకూర్(ఎం) : కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ఆత్మకూరు(ఎం), జనవరి 9 : అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తామని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 34 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను మంగళవారం మండల కేంద్రంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి కోసం సహకరించాలన్నారు. ఈ సందర్భంగా ఆత్మకూరు(ఎం) సర్పంచ్ జన్నాయికోడె నగేశ్ మండల కేంద్రంలో వాణిజ్య బ్యాంక్ ఏర్పాటుతోపాటు ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ పోస్టులు, రేషన్ డీలర్లను నియమించాలని ప్రభుత్వ విప్‌ను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ తండ మంగమ్మాశ్రీశైలం గౌడ్, జడ్పీటీసీ కొడిత్యాల నరేందర్‌గుప్తా, ఇన్‌చార్జి తాసీల్దార్ జలకుమారి, ఎంపీడీఓ నిరంజన్‌వలి, పీఏసీఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ పద్మ, సర్పంచ్ నగేశ్, ఎంపీటీసీ కవిత, ఉప సర్పంచ్ నవ్య పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పరిశీలించారు.

మోటకొండూర్ : కల్యాణలక్ష్మి పథకం ఆడబిడ్డలకు వరం లాటిందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయంలో మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వడ్డెబోయిన శ్రీలత, తాసీల్దార్ శాంతిలాల్, ఎంపీడీఓ వీరస్వామి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గోదాదేవి కల్యాణానికి రండి

● ఎమ్మెల్యే వీరేశానికి ఆహ్వానం

ఎమ్మెల్యే వేముల వీరేశానికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు

రామన్నపేట, జనవరి 9 : మండల కేంద్రంలోని చెన్నకేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 14న నిర్వహించే గోదాదేవి, రంగనాయక స్వామి వారి కల్యాణ మహోత్సవానికి విచ్చేయాలని స్థానిక సర్పంచ్ గోదాసు శిరీషాపృథ్వీరాజ్, ఆలయ చైర్మన్ లవణం ఉపేందర్ మంగళవారం ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా స్వామివారి కల్యాణ ఆహ్వాన పత్రిక, తీర్థ ప్రసాదాలను అందజేశారు. వారి వెంట ఎంపీటీసీ రేహాన్, అక్రం, గొలుసుల ప్రసాద్, మోటె రమేశ్ ఉన్నారు.



గుండాల : ఆలయ వార్షికోత్సవం సందర్భంగా పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

గుండాల, జనవరి 9 : మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయ 17వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. అర్చకుడు శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో కాగడ హారతి, క్షీరాభిషేకం, మండపు పూజ, హోమం, సామూహిక వ్రతం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మహేశ్వరం మహేందర్‌రెడ్డి, నాయకులు అండెం సంజీవరెడ్డి, ఈరసరపు యాదగిరి, ఇమ్మడి దశరథ, ఎంపీటీసీ కొర్న నరేశ్, సర్పంచులు చిందం వరలక్ష్మీప్రకాశ్, ఏలూరి రాంరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు జవ్వాజి కృష్ణయ్య, సూదగాని రామచంద్రయ్య, పొడిశెట్టి వెంకన్న, కొడపర్తి భాస్కర్, సామిశెట్టి వెంకటేశ్వర్లు, బజ్జూరి నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

భక్తి భావం అలవర్చుకోవాలి

రామన్నపేట, జనవరి 9 : ప్రజలు భక్తిభావం అలవర్చుకోవాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గోధుమగడ్డ జలేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఇంద్రపాలనగరం అయ్యప్ప స్వామి ఆలయంలో మహా పడిపూజ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 22 ఏండ్లుగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురుస్వాములు పావురాల కృష్ణ, రుద్రాల గోపాల్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

గడువులోగా ఆన్‌లైన్ నమోదు పూర్తి చేయాలి

● అదనపు కలెక్టర్ వీరారెడ్డి
● ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పరిశీలన

రాజాపేట ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

రాజాపేట, జనవరి 9 : ప్రజాపాలనలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాటా ఎంట్రీ ఆపరేటర్లు దరఖాస్తుల్లోని పూర్తి సమాచారాన్ని తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. ఇప్పటికి వరకు మండల వ్యాప్తంగా ఆన్‌లైన్ నమోదు చేసిన దరఖాస్తుల వివరాలను తాసీల్దార్ దామోదర్, ఎంపీఓ దినకర్‌ను అడిగి తెలుసుకున్నారు.

భువనగిరి కలెక్టరేట్ : ఆరు గ్యారంటీ పథకాల అమలు కోసం చేపట్టిన అభయహస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్‌రావు, డీఎల్‌పీఓ యాదగిరి, ఎంపీడీఓ గుత్తా నరేందర్‌రెడ్డి వేర్వేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజాపాలనలో భాగంగా 34 గ్రామ పంచాయతీల్లో 16,790 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందుపర్చుతున్నట్లు తెలిపారు. 34 మంది ఆపరేటర్లను నియమించి ఇప్పటి వరకు 7,200 దరఖాస్తులను ఆన్‌లైన్ చేసినట్లు చెప్పారు. సిరివేణికుంట, కేసారం, పచ్చర్లబోడుతండా, బాలంపల్లి, వడాయిగూడెం, రామచంద్రాపురంలో 100 శాతం ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు.

తప్పులు లేకుండా ఆన్‌లైన్ చేయాలి

భూదాన్‌పోచంపల్లి : ప్రజాపాలన దరఖాస్తుల కంప్యూటరీకరణలో తప్పులు లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని తాసీల్దార్ వీరాబాయి సూచించారు. మంగళవారం తాసీల్దార్ కార్యాలయంలో అభయహస్తం దరఖాస్తుల కంప్యూటరీకరణను ఆమె పరిశీలించారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ గడువులోగా కంప్యూటరీకరణ పూర్తిచేయాలని ఆదేశించారు. ఆమె వెంట డిప్యూటీ తాసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఎంఆర్ఐ వెంకట్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సైదిరెడ్డి, సర్వేయర్ సాయి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వనభోజనాల కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీసీ ఆర్ఎం శ్రీదేవి తదితరులు

ఒత్తిడిని అధిగమించేందుకు వనభోజనాలు

● ఆర్టీసీ నల్లగొండ రీజినల్ మేనేజర్ శ్రీదేవి

యాదగిరిగుట్ట, జనవరి 9 : నిత్యం ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు శారీరక, మానసిక ఒత్తిడికి గురవుతారని, ఆ ఒత్తిడిని అధిగమించేందుకు వనభోజనాలు, క్రీడలు నిర్వహిస్తున్నట్లు టీఎస్ ఆర్టీసీ నల్లగొండ రీజినల్ మేనేజర్ శ్రీదేవి అన్నారు. మంగళవారం యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో పరిధిలోని ఉద్యోగులు, కార్మికులతో కలిసి వనభోజనాలు, క్రీడల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తాయని పేర్కొన్నారు. అనంతరం వివిధ క్రీడల్లో గెలుపొందిన ఉద్యోగులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో యాదగిరిగుట్ట డిపో మేనేజర్ శ్రీనివాస్, అసిస్టెంట్ మేనేజర్ హుస్సేన్, గ్యారేజ్ ఇన్‌చార్జి హనుమాన్‌నాయక్, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

నేడు అడ్డగూడూరు మండల సమావేశం

అడ్డగూడూరు, జనవరి 9 : మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రమౌళి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా రామకృష్ణ

దుబ్బ రామకృష్ణ

వలిగొండ, జనవరి 9 : ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని ప్రొద్దటూరుకు చెందిన దుబ్బ రామకృష్ణ నియామకమయ్యారు. జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేశ్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నట్లు రామకృష్ణ తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

వేతన వేదన

● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2,192 మంది..
● అప్పులు చేసి విధులకు వెళ్తున్న పరిస్థితి
● కేసీఆర్ సర్కార్‌లో ప్రతి నెలా మొదటి వారంలోనే వేతనాలు
● కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీని నెరవేర్చాలంటున్న ఉద్యోగులు

సమగ్ర శిక్షా ఉద్యోగులకు 2 నెలలుగా జీతాల్లేవ్

సమస్యలు పరిష్కరించాలని నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు (ఫైల్)

రామగిరి/మునుగోడు, జనవరి 9 : 'అందరూ చదువాలి.. అందరూ ఎదుగాలి' అనే నినాదంతో ముందుకు సాగుతున్న సమగ్ర శిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ)ఉద్యోగులు జీతాలు రాక అవస్థలు పడుతున్నారు. విద్యాబోధనతోపాటు విద్యాశాఖ కార్యాలయాలు, క్షేత్రస్థాయిలో కార్యక్రమాల అమలుకు నిరంతరం కృషి చేస్తున్న వారికి రెండు నెలలుగా జీతాలు రావడం లేదు. కేసీఆర్ సర్కారులో మొదటి వారం రోజుల లోపు జీతాలు పొందేవారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఒక నెల జీతం ఆగగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల దాటినా వీరికి జీతాలు మాత్రం రావడం లేదు. చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న వారు అప్పులు చేసి కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వాటా మంజూరులో జాప్యమే కారణమా?

సమగ్ర శిక్షా నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60 : 40 శాతంలో మంజూరు చేయాల్సి ఉంటుంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్రం తన వంతు వాటా నిధులను జమ చేసిందని, రాష్ట్ర ప్రభుత్వం వాటిని వినియోగించడంతోపాటు తన వాటాను ఇంత వరకు జమ చేయక పోవడంతోనే సమస్య వచ్చిందని ఉద్యోగ వర్గాల్లో చర్చ సాగుతున్నది.

ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు అందించాలని, రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్లతో గతేడాది సెప్టెంబర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 20 రోజులకుపైగా సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు సమ్మె చేశారు. తాము అధికారంలోకి వస్తే ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 2,192 మంది ఉద్యోగులు...

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా సమగ్ర శిక్షలో 2,192 మంది ఉద్యోగులు కాంట్రాక్ట్ పద్ధతిలో వివిధ హోదాల్లో పని చేస్తున్నారు. నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి డీఈఓ కార్యాలయాల్లో 31 మంది, మండల మానవ వనరుల కేంద్రాల్లో ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు 64, డాటా ఎంట్రీ ఆపరేటర్లు 65, మెసెంజర్లు 65, భవిత సెంటర్లలో ఐఈఆర్‌పీలు 103, కేర్‌గివర్లు 63, స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో పాఠశాలల పర్యవేక్షణ క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్(సీఆర్‌పీ) 259, పాఠశాలల్లో పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు 410 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. వీరు కాకుండా కేజీబీవీలో బోధన ఉద్యోగులు 410, బోధనేతర సిబ్బంది 488, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో బోధన సిబ్బంది 36, బోధనేతర ఉద్యోగులు, రూ. 5, 500 నుంచి గరిష్ఠంగా రూ. 25 వేల వరకు నెల వేతనం పొందుతున్నారు. ఇతర సదుపాయాలేమీ వీరికి వర్తించవు. వచ్చే జీతంలో నుంచే బస్సు చార్జీలు, స్టేషనరీ భరించాల్సి ఉంటుంది. వీరిలో కేవలం నల్లగొండ జిల్లాలోనే ఆయా విభాగాల్లో 1,163 మంది ఉండగా మిగిలిన వారు సూర్యాపేట, యాదాద్రిలో ఉన్నారు.

వేతనాలను వెంటనే చెల్లించాలి

రెండు నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పని చేయించుకుంటున్నప్పటికీ వేతనాలు ఇవ్వడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. రెండు నెలలుగా కుటుంబ పోషణ భారంగా మారింది. ఇప్పటికైనా నూతన ప్రభుత్వ స్పందించి ఎన్నికల్లో ఇచ్చిన హామీ వేరకు మా సర్వీసును రెగ్యులరైజ్ చేయాలి. అందరు ఉద్యోగులతో సమానంగా ఒకటో తేదీలోపు వేతనాలు ఇవ్వాలి.

– తిరందాసు సంతోష్‌కుమార్, సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు

తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం

ఒడిశా, మహారాష్ట్ర, హర్యానాలో మాలాంటి ఉద్యోగులను అక్కడి ప్రభుత్వాలు క్రమబద్ధీకరించాయి. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చింది. నెరవేర్చి న్యాయం చేయాలి. గతంలో ఉద్యోగ భద్రతకు ధర్నాలు చేస్తే ప్రస్తుతం వేతనాల కోసం ఆందోళన బాట పట్టాల్సి వస్తుండడం బాధాకరం. సమగ్రశిక్షా మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు కూడా ఇవ్వడంలేదు.

– బృహిణి – సీఆర్‌పీ, తిప్పర్తి మండలం, నల్లగొండ జిల్లా

సీసీ రోడ్లు వేయాలని వినతి

చౌటుప్పల్, జనవరి 9 : చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని 16వ వార్డు పరిధిలో గల వినాయక నగర్ కాలనీలో అంతర్గత డ్రైనేజీలు, సీసీ రోడ్లు వేయాలని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కంభంపాటి నర్సింహగౌడ్, దేశగోని శ్రీశైలంగౌడ్, సామకూర యాదయ్య, బడేటి లింగస్వామిగౌడ్, పంతంగి సోమరాజు పాల్గొన్నారు.

కోతుల బెడద నివారించాలని...

చౌటుప్పల్, జనవరి 9 : చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో కోతుల బెడదను నివారించాలని కోరుతూ విద్యానగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ సోలిపురం భాస్కర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పోలోజు శ్రీధర్‌బాబు, కాలనీ అధ్యక్షుడు మండలోజు సుభాశ్ చంద్ర చారి, ఢిల్లీ శంకర్‌రెడ్డి, వీసం చంద్రారెడ్డి, ముటుకుల్లోజు ప్రభాకర్‌చారి, పిల్లల మర్రి దామోదర్, సందగళ్ల నాగరాజుగౌడ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బీబీనగర్, జనవరి 9 : స్కూటీని ఆర్టీసీ బస్సు ఢీకొట్టగా ఒకరు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి బీబీనగర్ మండల కేంద్రంలో చోటుచేసుకున్నది. ఎస్ఐ యుగంధర్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని అల్వాల్‌కు చెందిన గంధార సుమంత్(40) తన బైక్‌పై(టీఎస్ 21జె 6664)సోమవారం అర్ధరాత్రి భువనగిరి నుంచి అల్వాల్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో బీబీనగర్ పెద్దచెరువు కట్ట వద్ద సూపర్ లగ్జరీ బస్సు(టీఎస్ 03 జెడ్పీ 0506)అతివేగంగా స్కూటీని ఢీకొట్టడంతో సుమంత్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా దవాఖానకు తరలించారు. సుమంత్ తండ్రి సుగుణాకర్‌రావు ఫిర్యాదు మేరకు ఆర్టీసీ డ్రైవర్ రుద్రపు కుమారస్వామిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పద్మశాలి నాయకుల మృతికి నివాళి

భూదాన్‌పోచంపల్లి జనవరి 9 : పట్టణ కేంద్రంలో టై అండ్ డై అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు శ్రీరామ శ్రీనివాస్‌రావు, రాష్ట్ర నాయకుడు మచ్చ ప్రభాకర్‌రావు, అకాల మృతి పట్ల వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. వారి మృతిపై పలువురు నాయకులు ప్రగాఢ సంతాపం తెలిపారు. పద్మశాలీల శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేశారని వారి సేవలను కొనియాడారు. నివాళులర్పించిన వారిలో టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు తడక రమేశ్, ప్రధాన కార్యదర్శి భారత లవకుమార్, నాయకులు ముస్కూరి నరసింహ, సంగం చంద్రయ్య, కర్నాటి నర్సింహ, సీత లక్ష్మణ్, గుండు ఉప్పలయ్య, కుడికాల రామనర్సింహ పాల్గొన్నారు.